ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 137 | ఆదివారం 15 ఫిబ్రవరి, 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




# ₹3,32,205 కోట్ల బడ్జెట్



## అభివృద్ధి సంక్షేమానికి బలమైన హామీ

- రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు.. మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా..
- రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు.. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు..
- రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు.. ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు..
- జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు .. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు..
- అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు... పోలవరం రూ.6,105 కోట్లు కేటాయింపు
- బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

2026-27కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ అసెంబ్లీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. వరుసగా మూడోసారి ఆయన బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ఒకసారి ఒటాన్ అకౌంట్ బడ్జెట్.. రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన పయ్యావుల.. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లగా అంచనా వేశారు. అయితే, రాష్ట్ర రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2025- 26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లుకు చేరింది.


2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు ఉంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 80,567.47 కోట్ల ద్రవ్య లోటుగా నమోదు అయింది. ఇక, 2026-27బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2026-27 వార్షిక బ్జడెట్: రూ.3,32,205 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు,మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు,ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లుగా చూపారు. ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, 'వీబీ జీ రామ్ జీ'కి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు నిధి రూ.1,500 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ 2లో

## భక్తి ఉట్టిపడే మహాశివరాత్రి వైభవం
# దారులన్నీ శ్రీశైలం వైపే



- భక్తులతో కిటకిటలాడుతున్న శైవ క్షేత్రం..పాతాళగంగలో పవిత్రస్నానాలు
- కాలినడక భక్తులకు ప్రత్యేక సేవలు.. అన్నదానంతో ఆధ్యాత్మిక ఆనందం..
- అధికారుల పర్యవేక్షణలో సమగ్ర ఏర్పాట్లు.. కట్టుదిట్టమైన భద్రత.. 2లో

## ఉన్నంతలో మెరుగైన బడ్జెట్ అందించాం



- ఆదాయం తక్కువ - ఖర్చులు ఎక్కువ..
- బడ్జెట్‌పై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు 2 లో

## రైతు సంక్షేమానికి రూ 53,752కోట్లతో
# వ్యవసాయ బడ్జెట్

- ప్రతి రైతుకూ అండగా నిలుస్తామని ప్రభుత్వ హామీ..
- వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధన..
- ధాన్యం సేకరణ బకాయిలకు రూ.1,674 కోట్లు చెల్లింపు..
- పెట్టుబడి రాయితీగా రూ.310 కోట్లు కేటాయింపు..
- యాంత్రీకరణకు 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు..
- 'పొలం పిలుస్తోంది' ద్వారా 18 లక్షల మందికి విస్తరణ సేవలు..
- 80 శాతం రాయితీతో 1,130 డ్రోన్ కేంద్రాలు..
- పీఎం కిసాన్ కింద రూ.6,600 కోట్లు కేటాయింపు..
- వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన అచ్చెన్న..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, అదే రాష్ట్ర సుభిక్షానికి దారితీస్తుందని ఆయన వివరించారు. మొత్తం రూ.53,752 కోట్ల వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సాధారణ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన అనంతరం వ్యవసాయ, అనుబంధ రంగాల కేటాయింపులను అచ్చెన్నాయుడు వివరించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ఉన్న రూ.1,674 కోట్ల బకాయిలను ఇప్పటికే చెల్లించామని తెలిపారు. 2లో

# అంకెల గారడీ



- ప్రజలకు ఉపయోగ పడేలా లేదు..
- ప్రజల ఆసక్తిని నీరుగార్చిన బడ్జెట్..
- తమను పొగుడుకోవడానికే సరిపోయింది..
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన బొత్స

వివరాలు 2 లో

## పర్‌ఫార్మెన్స్ వీక్ పబ్లిసిటీ పీక్



- బడ్జెట్ పుస్తకంలో బొమ్మలు హైలెట్.. 2 లో
- ఆదాయ వ్యయాలపై పొంతలన లేని లెక్కలు..
- బడ్జెట్ తీరుపై మండిపడ్డ మాజీ ఆర్థికమంత్రి బుగ్గన

## 16న వస్తున్న బిల్‌గేట్స్

- మూడుసార్లు ఏపికి రప్పించిన ఘనత నాదే 2లో
- సంజీవిని ప్రారంభానికి వస్తున్నారని వెల్లడించిన సిఎం

## సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేల ప్రోగ్రెస్



- మారకపోతే మీకే నష్టం తప్పదు..
- 1995-96లో తన పాలన పునరావృతం చేస్తా..
- ఎమ్మెల్యేకు బాబు గట్టి హెచ్చరిక 2లో

## కుటుంబ సమేతంగా టీడీపీ శ్రేణులకు
# లోకేష్ విందు

విజయవాడ, గుంటూరు నేతలతో భేటీ.. ఆత్మీయంగా పలకరింపులు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

రాజకీయ వ్యూహాలు, అసెంబ్లీ బడ్జెట చర్చల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని.. ఆయన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వనభోజనాల తరహాలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయ చర్చలకు తావులేకుండా, కేవలం కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, వారికి గల క్రీడాభిలాషపై మాట్లాడుకున్నారు. సమావేశానికి వచ్చిన చిన్నపిల్లలతో లోకేష్ సరదాగా కబుర్లు చెబుతూ గడిపారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదు..పిల్లలు క్రీడలను కూడా కెరీర్‌గా ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి' అని లోకేష్ ఈ సందర్భంగా సూచించారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు లోకేష్ ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు. ఈ సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మంగళగిరి (మిగతా 2లో)

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు
# కేంద్ర కేబినెట్ ఆమోదం



- అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం..
- ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, (మిగతా 2లో)

# రూ 3,32,205కోట్ల బడ్జెట్

(మొదటి పేజి (తరువాయి)



ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు పరిశీలిస్తే ...ఎన్టీఆర్ భరోసా - రూ.27,719 కోట్లు,దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు - రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి - రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో - రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు రూ.3,836 కోట్లు ,మగ్ర శిక్ష రూ.2,946 కోట్లుఉన్నత విద్య రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం- రూ.2,161 కోట్లు ,మనబడి మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి కిరూ.1,232 కోట్లు,పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు రూ.654 కోట్లు, యువత, క్రీడలు రూ.438 కోట్లు కేటాయించారు. శాఖల వారిగా బ్జడెట్ కేటాయింపులు పరిశీలిస్తే... వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.13,598 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ - రూ.22,942 కోట్లు, మున్సిపల్ శాఖ - రూ.14,539 కోట్లుజలవనరుల శాఖ - రూ.18, 224 కోట్లు, పాఠశాల విద్యాశాఖ - రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ - రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ - రూ.11,118 కోట్లు, కార్మిక శాఖ - రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ - రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ - రూ.9,856 కోట్లు, హోం శాఖ - రూ.9,165కోట్లు కేటాయించారు. ఇక ఇతర కేటాయింపులు పరిశీలిస్తే ..పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలుకొత్త పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాలు,ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు,జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు,స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు,విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు,రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు, కేటాయించారు. వరుసగా మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తన అదృష్టమని అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్ రూపొందించినట్లు తెలిపారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేది బడ్జెట్ అన్నారు. కుటుంబాన్ని నడిపిస్తున్న గృహిణికి భరోసా ఇచ్చేది బడ్జెట్ అని చెప్పుకొచ్చారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలో పరుగులు పెట్టించాలనే సంకల్పం తమది అని స్పష్టం చేశారు. బ్రాండ్ చంద్రబాబు వల్లే స్వర్ణాంధ్ర సాకారమన్నారు ఆర్థిక మంత్రి . గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకుంది బాహుబలి ఒప్పందమని తెలిపారు. రైతుల కలలను నెరవేర్చేలా, యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేలా, తన బిడ్డలను చక్కగా పెంచాలనే తల్లికి భరోసా ఇచ్చేలా బడ్జెట్ ఉందన్నారు. పాలన ఎలా చేయకూడదో అనేది గత ప్రభుత్వ రాష్ట్రానికి చేసిన నష్టాన్ని చూస్తే అర్థమవుతుందని తెలిపారు . గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దేలా 2024లో బడ్జెట్ ప్రవేశపెడితే... స్వర్ణాంధ్ర విజన్-2047కు బాటలు వేస్తూ 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక విధ్వంసం ఎదుర్కొన్న రాష్ట్రాన్ని సరిదిద్దడానికి రెండేళ్ల సమయం ఎంత మాత్రమూ సరిపోదని మంత్రి చెప్పారు. ఈరాష్ట్రానికి విభజనతో జరిగిన నష్టంతో పాటు... గత ప్రభుత్వ పాలన కూడా తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు మంత్రి. చాలా సవాళ్లు ఉన్నా రాష్ట్రం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి జరిగిందని చెప్పడానికి గర్వపడుతున్నానని అన్నారు. ఇప్పటి వరకు ఏం సాధించాం... ఇంకా ఏం సాధించాలనే అంశాల ఆధారంగా బ్జడెట్ రూపొందించామని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దామన్నారు. కాగితాలకే పరిమితం కాకుండా... క్షేత్ర స్థాయిలో సంక్షేమాన్ని అమలు చేయడమే లక్ష్యంగాబడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

# ఉన్నంతలో మెరుగైన బడ్జెట్ అందించాం

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ఏపీ సీఎం చంద్రబాబు (తెలిపారు. రెండుమూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. వైకాపా విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. ఇబ్బందులు అధిగమించి ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని చెప్పారు. ఆదాయం తక్కువ - ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చింది. కేంద్ర సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం. వ్యవసాయం, సేవారంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాలి. రెండుమూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుంది. అక్కడి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నాం. అమరావతికి రాకపోకలు పెరిగి ఆదాయమూ వస్తుంది. అమరావతికి పశ్చిమ బైపాస్‌తో యాక్సెస్ పెరిగింది. ఇన్నర్, ఔటర్ రింగురోడ్డుతో మరింత పెరుగుతుంది. హార్టీకల్చర్ హబ్‌కు రూ.30వేల కోట్లు కేటాయించడం బాగుంది. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదు. 2014-19 మధ్య కూడా రెయిన్ గన్స్‌తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది. అప్పుడే హంద్రీనీవాను సీరియస్‌గా తీసుకున్నాం. రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే. దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉంది. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక వారి పనితీరుకు నిలువుటద్దం. నేను గతంలో ఉన్నట్లు నిక్కచ్చిగానే ఉంటా. మారకపోతే వాళ్లకే నష్టం. మొత్తం 9 పారామీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా. వారికి తెలియని ఇంకొన్ని పారామీటర్లు కూడా నా వద్ద ఉన్నాయి. లోకేశ్ తన పని తాను చేస్తున్నాడు. నా పని నేను చేస్తున్నా. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్.. భయం-భక్తిలా ఉండాలి. మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ కల్పిస్తున్నారని చంద్రబాబు తెలిపారు.

# బడ్జెట్ అంతా అంకెల గారడీ


**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ బ్జడెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడిన ఆయన, ఈ బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చలేదని ఆరోపించారు. బడ్జెట్ కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని, కానీ 1 నుంచి 8 పేజీల వరకూ ప్రభుత్వం తమను తాము పొగడుకోవడానికే, గత ప్రభుత్వాన్ని విమర్శించ డానికే ఉపయోగించిందని అన్నారు బొత్స? ప్రజలు అభివృద్ధి కోసం అధికారం ఇచ్చారని, కానీ బ్జడెట్‌లో మాత్రం అభివృద్ధి కంటే పేర్ల ప్రస్తావనలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ పేర్లే పదేపదే ప్రస్తావించారని.. వాళ్ల డబ్బా కొట్టుకున్నారని బొత్స ఆరోపించారు. రైతులకు మద్దతు ధరపై ఎక్కడా స్పష్టత లేదని, సున్నా వడ్డీ రుణాలపై కేటాయింపులు కనిపించడం లేదని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సున్నా వడ్డీ రుణాలు సమయానికి అందించామని, ఇప్పుడు వాటి ఊసే లేదని అన్నారు. పనికి ఆహార పథకానికి తగిన కేటాయింపులు లేవని కూడా విమర్శించారు. అప్పుల విషయంలో ప్రభుత్వం గణాంకాలతో గారడీ చేస్తోందని ఆరోపించారు బొత్స.. గత వైసీపీ హయాంలో రూ.3 లక్షల 20 వేల కోట్లు మాత్రమే అప్పులు చేశామని మీరే చెప్పారని, ఇప్పుడు రూ.9 లక్షల కోట్లు చేశారని చెప్పడం అబద్ధమని అన్నారు. ఈ 20 నెలల కాలంలో 20 లక్షల ఐడెంటిటీ కార్డులు ఇచ్చామని చెబుతున్నా, ఒక్క కౌలు రైతుకైనా నష్టపరిహారం అందించారా అని ప్రశ్నించారు. ఈ బ్జడెట్ వల్ల సమాజంలోని ఏ వర్గానికీ ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఈ అంశాలన్నింటిపై మండలిలో పోరాడతామని, అధికార పక్షాన్ని నిలదీసి సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. దేవదేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని చెప్పినా, ఇప్పుడు అదే విషయంపై అధికార పక్షం డిఫెన్స్‌లో పడిందని బొత్స వ్యాఖ్యానించారు. మొత్తానికి, ఈ బ్జడెట్ అంకెల గారడీతో నిండిపోయిందని, ప్రజలకు ఉపయోగపడే స్పష్టమైన ప్రణాళికలు లేవని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

# రైతు సంక్షేమానికి రూ 53,752కోట్లతో

# వ్యవసాయ బడ్జెట్

(మొదటి పేజి (తరువాయి)



రైతుల పెట్టుబడి భారం తగ్గించేందుకు రూ.310 కోట్లు రాయితీ కింద కేటాయించగా, వ్యవసాయ యాంత్రీకరణకు 50 శాతం రాయితీతో రూ.136 కోట్లు వినియోగిస్తున్నట్లు చెప్పారు.భూసారాన్ని అంచనా వేసేందుకు 6 లక్షల భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. ఆధునిక సాంకేతికత వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ 80 శాతం రాయితీతో రూ.90.4 కోట్ల వ్యయంతో 1,130 డ్రోన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గత ఏడాది రూ.182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం నమోదైందని తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటివరకు రూ.6,309 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, 2026--27లో రూ.6,600 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 24 గంటల్లో రూ.9 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతంగా ఉందని చెప్పారు.నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 11 పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించి వాటి ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా ముందుకు సాగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, పంటలను కాపాడేందుకు అన్నివిధాలుగా సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు.

# దారులన్నీ శ్రీశైలం వైపే



**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహా క్షేత్రం ఆధ్యాత్మిక ఉత్సాహంతో అంబరాన్నంటింది. దేశం నలుమూలల నుంచి భక్తులు వాహనాల్లో, కాలినడకన తరలివచ్చి క్షేత్రాన్ని కిటకిటలాడేలా చేశారు. శివనామస్మరణతో శ్రీగిరులు మారుమోగుతూ భక్తి ప్రవాహంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి, పట్టణాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో దారులన్నీ శ్రీశైలం వైపే అన్నట్టుగా పరిస్థితి కనిపించింది.పాతాళగంగలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అదనపు షవర్లు, కుళాయిలు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గజ ఈతగాళ్లను నియమించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. పార్కింగ్ ప్రదేశాల్లో ఉచిత మరుగుదొడ్లు, స్నానాల సౌకర్యాలు కల్పించారు. భక్తులు సేదతీరేందుకు షెడ్లు, శామ్యానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.
కైలాస ద్వారం నుంచి కాలినడకన వచ్చే భక్తుల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేశారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. ఉచిత బస్సు సౌకర్యాలు కల్పించి రవాణా ఇబ్బందులు లేకుండా చూసుకున్నారు. శివదీక్ష శిబిరాల వద్ద ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, పాలు, మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేశారు.అన్నదాన కార్యక్రమాలు క్షేత్రం అంతటా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంచాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నిర్వహిస్తున్న అన్నదానానికి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో క్యూలైన్లలో, స్వామి అమ్మవార్ల అన్నప్రసాద భవనంలో శివస్వాములు, శివభక్తులకు ప్రత్యేక అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్ల నిర్వహణను సమర్థంగా చేపట్టారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి లోటు లేకుండా ప్రతి ఏర్పాటును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. లడ్డూ విక్రయ కేంద్రాలను పలుచోట్ల ఏర్పాటు చేసి ప్రసాదాల పంపిణీ సజావుగా కొనసాగించారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం గ్రామోత్సవాన్ని తిలకిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో తిరుగు ప్రయాణం అవుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం భక్తిరసంతో నిండిపోయి అపూర్వ వైభవాన్ని సంతరించుకుంది.

# పర్‌ఫార్మెన్స్ వీక్.. పబ్లిసిటీ పీక్

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

కూటమి ప్రభుత్వ పనితీరు 'పెర్ఫామెన్స్ వీక్, పబ్లిసిటీ పీక్' అన్నట్టుగా ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు. బడ్జెట్ పుస్తకంలో బొమ్మలు తప్ప అసలు ఆదాయాలు, ఖర్చుల స్పష్టమైన వివరాలు లేవని ఆరోపించారు. ఏపీ బ్జడెట్ 2026-27పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు . ఇప్పటికే రూ.3.12 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారని, కానీ రాష్ట్ర మొత్తం అప్పులపై స్పష్టత ఇవ్వలేదని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని, బ్జడెట్‌లో చెప్పిన అనేక అంశాలు ఊహాగానాలేనని విమర్శించారు.రూ.90 వేల కోట్లకంటే ఎక్కువ ఆదాయం వచ్చే పరిస్థితి లేకపోయినా, 60 శాతం పెరిగినట్టు అంచనాలు చూపిస్తున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ఎంత నిధులు కేటాయించారో వెల్లడించలేదని ప్రశ్నించారు బుగ్గన.. తమ హయాంలో గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, నాడు-నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, పోర్టులు నిర్మించామని గుర్తుచేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులకు పలు పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించామని తెలిపారు.కాగ్ నివేదికల ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారలేదని, కేంద్రం కంటే ఆదాయ వృద్ధి ఎక్కువగా ఉందని చెప్పారు బుగ్గన? జల జీవన్ మిషన్ కింద ఖర్చు చేసిన నిధులపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి హామీలకు తగిన కేటాయింపులు లేవని ఆరోపించారు. ఉద్యోగుల బకాయిలు రూ.40 వేల కోట్లకు చేరుకున్నాయని పేర్కొన్నారు. మొత్తం మీద ఈ బ్జడెట్ ప్రజాశ్రేయస్సుకు తోడ్పడేలా లేదని, ఇది 'అనాలసిస్ ఆఫ్ బ్జడెట్' కంటే 'అనాలసిస్ ఆఫ్ అబద్ధాలు'గా మారిందని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. బ్జడెట్ అనేది ప్రజాశ్రేయస్సుకు తోడ్పడే విధంగా, పద్ధతిగా అధ్యయనం చేసి రూపొందించాలి. కానీ ఈసారి కూటమి ప్రభుత్వం ఇచ్చిన బ్జడెట్‌లో అంతటి లోతైన విశ్లేషణ లేకుండా ఊహాజనితమైన లెక్కలతో మాత్రమే ఏర్పాటుచేయబడిందని విమర్శించారు బుగ్గన.. అసలు ఆదాయాలు, అప్పుల వివరాలను బ్జడెట్‌లో చూపించకపోవడం ప్రజలకు గందరగోళాన్ని సృష్టిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ అప్పులను 'మట్కా నంబర్ల' మాదిరిగా చూపిస్తూ అసత్యాలు ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని, కానీ ఈ ప్రభుత్వం బ్జడెట్‌లో కూడా నిజాలను చెప్పలేదని బుగ్గన హెచ్చరించారు. ఈ పరిస్థితిలో ఆయన 'అనాలసిస్ ఆఫ్ బ్జడెట్' కాదు, 'అనాలసిస్ ఆఫ్ అబద్ధాలు' చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..

# 16న ఎపికి వస్తున్న బిల్‌గేట్స్



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ 16న సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. 'ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే' అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నామని వివరించారు. ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధప్రదేశ్'గా మార్చడం, ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ హెల్త్ రికార్డులు: సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొ÷ల్/డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, వ్యాక్సినేషన్ రికార్డులు స్టోర్ అవుతాయి. మొబైల్ ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు. క్యాష్‌లెస్, పేపర్‌లెస్ మాత్రమే కాకుండా తక్షణ సాయం అందుతుంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అవసరమైతే ట్రస్ట్ ద్వారా అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం రూ.25 లక్షల వరకు సాయం అందించనున్నారు. ముందుగానే రోగాలను గుర్తించడం. ఉదాహరణకు 30 ఏళ్లు దాటిన వారికి, హై-రిస్క్ కేసులకు స్క్రీనింగ్. రాష్ట్రవ్యాప్తంగా 72.73 లక్షల మందికి 42 రకాల వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు, డయాబెటిస్, , గుండె సంబంధిత వంటివి) చేస్తారు.ఏఐఆధారిత స్క్రీనింగ్, పర్సనలైజ్డ్ మెడిసిన్ కార్యక్రమాన్ని బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారంతో అమలు చేస్తున్నారు. ఇది ఆయుష్మాన్ భారత్, హెల్త్ సర్వీసెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. అమరావతి రాజధాని ప్రాంతంగా ఉండటంతో.. సంజీవని పథకం ఇక్కడ ప్రధానంగా అమలు చేయాలని చూస్తున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలు అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు. బిల్ గేట్స్ తన పర్యటనలో (ఫిబ్రవరి 16) అమరావతికి వచ్చి ఈ పథకంపై చర్చలు జరుపుతారు. ఇది అమరావతిని హెల్త్‌కేర్ / టెక్నాలజీ హబ్‌గా మార్చే భాగంగా చూస్తున్నారు. మొదటి పైలట్ ప్రోగ్రాం కుప్పం నియోజకవర్గంలో విజయవంతంగా ప్రారంభమైంది. తర్వాత 2026 జనవరి నుంచి చిత్తూరు జిల్లా మొత్తం అమల్లోకి తెచ్చారు. 2026లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తారు. జూలై 2026 నాటికి లక్షల మంది స్క్రీనింగ్ పూర్తి చేసి, ఆరోగ్య భద్రతను బలోపేతం చేయాలనేది ఈ పథకం లక్ష్యం. ఈ పథకం రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చే 'గేమ్ ఛేంజర్'గా చెబుతున్నారు.

# కేంద్ర కేబినెట్ ఆమోదం

(మొదటి పేజి (తరువాయి)

నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- త్రిమ్బక్ - పాల్ఘర్ సెక్షన్ అప్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేల ప్రోగ్రెస్

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**

ఎమ్మెల్యేల పనితీరు మారకపోతే వారికే నష్టమని, సీఎం నారా చంద్రబాబు నాయుడు తన పాలనా శైలిపై మరోసారి స్పష్టత ఇచ్చారు. 1995-96లో తన పాలనలో ఉన్న నిక్కచ్చితత్వాన్ని మరోసారి పునరావృతం చేస్తానని ఆయన ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారికి సీల్డ్ కవర్లలో నివేదికలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నివేదికల ద్వారా వారిని వారికే అద్దంలో చూపిస్తున్నామని, మారకపోతే వారికే నష్టమని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. '1995-96 మాదిరిగానే నిక్కచ్చిగా ఉంటా. 9 అంశాల్లో సర్వే చేయించి నివేదికలు ఇస్తున్నా. సీల్డ్ కవర్లలో ఇచ్చే ఈ నివేదికల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాం. మారకపోతే వాళ్లకే నష్టం' అని చంద్రబాబు అన్నారు. ఇక నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై అత్యంత కఠినంగా వ్యవహరించనున్నానని సీఎం పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ పనితీరుపై సీఎం చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. 'లోకేష్ పని లోకేష్ చేస్తున్నారు, నా పని నేను చేస్తున్నాను' అని స్పష్టం చేశారు. ముఖ్యంగా మంగళగిరి చేనేత చీరలకు లోకేష్ కల్పిస్తున్న అంతర్జాతీయ బ్రాండింగ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# లోకేష్ విందు

(మొదటి పేజి (తరువాయి)

చేనేత చీరలను కానుకగా అందజేసి తన నియోజకవర్గ బ్రాండింగ్‌ను చాటుకున్నారు. కేవలం విందుకే పరిమితం కాకుండా.. బాధ్యతాయుతమైన నాయకుడిగా లోకేష్ మరో అడుగు వేశారు. గతంలో ఆయా నియోజకవర్గాల నాయకులు తనకు ఇచ్చిన వినతులపై తాజా పరిస్థితి ఏంటి? పనులు ఏ దశలో ఉన్నాయి? అనే అంశాలతో కూడిన స్టేటస్ రిపోర్టులను స్వయంగా ఆయా నాయకులకు అందజేశారు. ఈ విందులో గుంటూరు ఎంపీ / కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ (తెనాలి-జనసేన), ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్ (తాడికొండ),ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు),బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), గల్లా మాధవి (గుంటూరు వెస్ట్),నసీర్ అహ్మద్ (గుంటూరు ఈస్ట్),ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్
విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని),తంగిరాల సౌమ్య (నందిగామ),శ్రీరాం రాజగోపాల్ (జగ్గయ్యపేట),వసంత వెంకట కృష్ణప్రసాద్ (మైలవరం),కొలికపూడి శ్రీనివాసరావు (తిరువూరు)
బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్),గద్దె రామమోహన రావు (విజయవాడ ఈస్ట్)
ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వీరిలో ఉన్నారు.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతికరం

## ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది



**ద్రాక్షారామం (తెలుగోడు), ఫిబ్రవరి 14:**

శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి. అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి.మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్థాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.



జాతీయ స్థాయి గణిత పోటీలకు ఎంపికైన
శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థిని షాహిన్

## జాతీయ స్థాయి గణిత పోటీలకు శ్రీ వివేకానంద విద్యార్థిని ఎంపిక

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
యాడికి మండల కేంద్రంలోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ వివేకానంద హై స్కూల్‌కు చెందిన విద్యార్థిని షాహీన్ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్స్‌కు షాహీన్ ఎంపికయింది. ఇటీవల జరిగిన ప్రాంతీయ, రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత వేగంగా గణిత సమస్యలను సాధించి, తన మేధస్సును చాటుకున్న షాహీన్ ఇప్పుడు దేశవ్యాప్త పోటీల్లో పాల్గొనబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలు మార్చి నెలలో జరగనున్నాయి. షాహీన్ సాధించిన ఈ విజయం పట్ల శ్రీ వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్, హెడ్ మిస్ట్రెస్ శైలజ, శిక్షకురాలు అపర్ణ , ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. వేదిక్ మ్యాథ్స్ వంటి కఠినమైన సబ్జెక్టులో జాతీయ స్థాయికి ఎంపికవ్వడం పాఠశాలకే కాకుండా మన ప్రాంతానికే గర్వకారణమని వారు కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని షాహిన్ నకు అభినందనలు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

*యువనేత గుమ్మనూరు ఈశ్వర్..*

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
గుత్తి పట్టణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి , పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా యువనేత గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గ లోని ప్రజలు తమ ఆరోగ్య సమస్యలు బాగాలేక అప్పులు చేసి ఆసుపత్రుల్లో చూపించుకుని అర్జీ పెట్టుకున్నారన్నారు. వారికి కుటుంబం పెద్ద కొడుకులా , అన్నగా అండగా నిలిచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో 30 విడతలలో 4 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఘనత గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంకి దక్కుతుందన్నారు. శనివారం గుత్తి పట్టణం పైమాలవీధిలో నివాసం ఉంటున్న రంగస్వామికి 1,05,000 రూపాయలు , కాపు స్ట్రీట్‌లో నివాసముంటున్న వెంకటరామిరెడ్డికి 62,000 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎక్కువగా సీఎం రిలీఫ్ ఫండ్ అందించిన నియోజకవర్గం గుంతకల్లు నియోజకవర్గం అని యువనేత గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా బ్ధిదారులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడి చికిత్స తీసుకున్న వారికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్స్ చెక్కులు పంపిణీ చేసిందన్నారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన జనసేన నాయకులు పోతురాజు చిన్న వెంకటేశు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు
అందిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్




పైమాలవాడలో సమస్యలను వివరిస్తున్న జనసేన నాయకులు చిన్న వెంకటేశు

## శివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని శైవ క్షేత్రాలు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శివ బాలయోగి మహరాజ్ ఆశ్రమం ముందు విద్యుత్ దీపాల తోను శివుని చిత్రపటానికి చారలతో భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఒకటో రోడ్డు లోని శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ మండలి, శ్రీ శృంగేరి శంకర మఠం నిర్వహిస్తున్న శివరాత్రి పర్వదినాన్ని విశేషంగా జరపడానికి సన్నాహాలు చేశారు.





విద్యుత్ దీపాలతో అలంకరించిన శివ బాలయోగి ఆశ్రమం

## రాష్ట్ర స్థాయిలో మెరిసిన వాగ్దేవి హైస్కూల్ విద్యార్థులు

### నేషనల్ లెవెల్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపిక.. పాఠశాల కరస్పాండెంట్ శివప్రసాద్ రెడ్డి..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
యాడికి మండల కేంద్రంలోని వాగ్దేవి హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథమెటిక్స్ పోటీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో మరింత ఉన్నతంగా నిలబెట్టారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న వాగ్దేవి హైస్కూల్ మరోసారి తన విశిష్టతను నిరూపించిందని పాఠశాల కరస్పాండెంట్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు ఈ పోటీలలో ఎన్. నిత్యశ్రీ, కె. భావిష్య, కె. మనోగ్న, ఎస్. నరేష్, ఎస్. గౌతమ్, వి. అక్షిత నేషనల్ లెవెల్‌కు ఎంపికై పాఠశాలకు గౌరవం తెచ్చారు. ప్రథమ బహుమతులను ఎన్. నిత్యశ్రీ, కె. భావిష్య, కె. మనోగ్న, ఎస్. నరేష్, వి. అక్షిత అందుకోగా, ద్వితీయ బహుమతిని ఎస్. గౌతమ్ సాధించారు. తృతీయ బహుమతులను ఎం. అవంతిక, ఐ. నందిత, టి. విన్యా రెడ్డి, హసిని,టి. గిరిజ, బి. హిమశ్రీ, బి. నందిని పొందారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయులు రాధను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎస్. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, పాఠశాల విలువలే ఈ విజయానికి మూల కారణం అన్నారు. వాగ్దేవి హైస్కూల్ రాష్ట్రం మాత్రమే కాదు, జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకుంటుంది అని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు అభినందించారు.




నేషనల్ లెవెల్‌కు ఎంపికైన వాగ్దేవి హైస్కూల్ విద్యార్థులు




నేషనల్ లెవెల్‌కు ఎంపికైన వాగ్దేవి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## పెన్షనర్ల సర్వ సభ్య సమావేశం

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం ప్రెసిడెంట్ అబూబాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్ ,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ పెన్షనర్స్ బ్యాంకు పాస్ బుక్కులో నామినీ పేరు నమోదు చేయించుకోవాలని, లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఈనెల చివరి వరకు సమయం ఉందన్నారు. ఇంకా డి. ఏలు పెండింగ్ వున్నాయని వెంటనే ఐ. ఆర్.ప్రకటించాలని చెప్పారు.

***దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు..***
దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి తొలి దళిత ముఖ్యమంత్రి. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో ,ఆంధ్ర రాష్ట్ర ములో ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ములో,కేంద్ర ప్రభుత్వం లో అనేక మార్లు మంత్రి పదవిని అలంకరించారన్నారు. రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షుడు అన్నారు. 38 సంవత్సరాల పిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఈయనకే దక్కిందని జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, విజయ లక్ష్మి, శకుంతల మ్మ,కృష్ణ వేణి, దుర్గమ్మ, దేవదాస్, స్వామిదాస్, గోవిందు, అస్సన్ అహమ్మద్,గోవిందప్ప, వెంకట్, సిద్దయ్య, ఆనంతమ్మ, ఫక్రుద్దీన్, చెన్నారెడ్డి, శామ్యూల్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

## అక్కదేవతల దర్శనానికి వెళ్లిన రాయల చెరువు భక్తులు

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
యాడికి మండలంలోని రాయల చెరువు గ్రామంలో భక్తులు మహాశివరాత్రి సందర్భంగా శనివారం అక్కదేవతల దర్శనానికి భారీగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. శనివారం రాయల చెరువు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలు భక్తులు శ్రీ అక్కమ్మ మహాదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఆలయం వద్ద ఉన్నపెద్దమ్మ తల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు . అనంతరం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక వాహనాలలో కడప జిల్లాలోని పొలతలకొండకు తరలి వెళ్లారు. మహాశివరాత్రి పర్వదినాన పురస్కరించుకొని పొలతల కొండలో శ్రీ అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రాయల చెరువు గ్రామంలో ఉన్న రంగరాజుకుంట రామాంజనేయులు, రంగరాజు కుంట బ్రదర్స్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు తరలి వెళ్లారు.




కడప జిల్లా పొలతల కొండ అక్క దేవతల దర్శనానికి ప్రత్యేక వాహనాలతో వెళుతున్న రాయల చెరువు భక్తులు



కడప జిల్లా పొలతల కొండ అక్క దేవతల దర్శనానికి ప్రత్యేక వాహనాలతో వెళుతున్న రాయల చెరువు భక్తులు



బోరు కేబుల్ వైర్ చోరీపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

## పొలాల్లో కేబుల్ వైర్ చోరీ

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
యాడికి మండల పరిధిలోని టీ కొత్తపల్లి గ్రామం గుర్తుతెలియని దొంగలు మోటర్ కేబుల్ వైర్ చోరీ చేసినట్లు బాధ్యత రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈనెల తొమ్మిదో తేదీ నుండి 13వ తేదీ వరకు ఐదు రోజుల్లో 25 మంది రైతుల బోర్ మోటార్ కేబుల్ వైరును దొంగలు దొంగలించుకుని పోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతూ నష్టపోయామని రైతులు హెడ్ కానిస్టేబుల్ శివగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దొంగలను పట్టుకొని నాయం చేయాలని వారు కోరారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు అన్నదానం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ శ్రీమతి. డాక్టర్. ఎస్.నిర్మలమురళి నగరంలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారు. అన్నదానంతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్మలమురళి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉన్న దానిలో విద్యార్థులు సర్దుకుపోయే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. చదువుకు మించిన సంపద లేదన్న విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ చదువులో రాణించాలన్నారు. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద , చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి భేటి

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. పార్టీలో కొందరు వ్యవహరిస్తున్న తీరు మీద ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రతి ఒక్కరు పార్టీ లైన్‌లో ఉండాలని, అందరూ క్రమశిక్షణగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యే సీఎంకి విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం

# శ్రీ భోగేశ్వరస్వామి

***మహిమాన్విత క్షేత్రం శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం నేడు మహా శివరాత్రి వేడుకలు ..***

***పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :***
*అనంతపురం జిల్లాలోనే అతిపెద్ద శివలింగం పామిడి శ్రీ భోగేశ్వరస్వామి దేవలయంలో నిత్యపూజలు అందుకుంటోంది. కోరిన కోర్కెలను తీర్చే కొంగు బంగారంగా శ్రీ భోగేశ్వరస్వామికి పేరుంది. పామిడి ప్రాంతం జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున భక్తులు ఇక్కడకు చేరుకుని స్వామిని దర్శించుని పూజలు చేపడుతుంటారు.*

***ఆలయ చరిత్ర..***
*పామిడి శ్రీ భోగేశ్వరస్వామి దేవలయానికి విశేష చరిత్ర ఉంది. విజయనగర సామ్రాజ్యం అనంతరం 1657లో సామంతరాజు పరమేశ్వర ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శిలాఫలకం ద్వారా తెలుస్తోంది. తన భార్య భోగవతి ద్వారా సామంతరాజు పరమేశ్వర శ్రీ భోగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉండగా ఈ ఆలయం పక్కనే ఉన్న గ్రామాన్ని భోగపట్టణం అని పిలిచేవారు . తదనంతరం ఆది కాస్త శేషగ్రంధిపురంగా మారింది. గతంలో పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి తీవ్ర అంతరాయం కలిగేది. పెన్నానదిని దాటి వెళ్లేందుకు అనువుగా ఆలయ ప్రాంగణం నుండి పెన్నానది ఆవలి ఒడ్డున ఉన్న సత్రం వరకూ భూగర్భమార్గం నిర్మించగా కాలక్రమంలో అది మూసుకుపోయినట్లు తెలుస్తోంది. పెన్నానదికి వరదలు వచినప్పుడు ఈ మార్గం గుండా రాకపోకలు జరిగేవి. విజయనగర సామ్రాజ్యం పతనం అనంతరం ముస్లింల దండయాత్రల నేపథ్యంలో హిందూ దేవాలయాలు, శిల్పకళను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై పడింది. హాళేబీడు (కర్ణాటక) గ్రామస్తులు అక్కడి ఆలయాలతో పాటు గ్రామాన్ని మట్టితో కప్పివేయగా పురావస్తు శాఖ వారు తవ్వకాలు జరిపి హాళేబీడును వెలికి తీశారు. అదేవిధంగా పామిడిని కూడా మట్టి ఇసుకతో కప్పివేయటంతో ఆలయ ఆనవాళ్లు లేకుండా గ్రామం సైతం కనుమరుగైంది.*

***పామిడికి ఆపేరెలా వచ్చింది..***
*పెన్నానది పక్కనే ఉన్నట క్షేత్రపాలకొండ (శింజిరప్పకొండ)కు సమీపంలోని గ్రామమే పామిడి. ఈకొండను ఆనుకొని ఉన్న గ్రామాన్ని క్షేత్రపాలకొండ పట్నం అనే పేరుతో పిలుస్తుండేవారు. ఆ గ్రామంలోని ఓ కాపు కులస్థునికి ఆవుల మంద ఉండేది. ఆవుల మందను క్షేత్రపాలకొండ పట్నంకు ఈశాన్యంగా రెండు కిలోమీటర్ల దూరంలో (ప్రస్తుత శ్రీ భోగేశ్వరస్వామి ఆలయం ఉన్న ప్రాంతం) చుట్టూ అడవులు ఉండటంతో ఆవులను మేతకు వదులుతుండేవారు. ఆవుల మంద నిత్యం అడవులకు పోయి వస్తుండగా కొంత కాలానికి మందలోని ఒక ఆవు పెన్నానది ఒడ్డున ఉన్న పుట్టమీద నిలుచుని పాలు ఇస్తున్న విషయాన్ని గమనించిన కాపరి సమాచారాన్ని గ్రామస్థులకు తెలుపగా జనం తండోపతండాలుగా పుట్ట వద్దకు చేరుకున్నారు. పుట్టను ఓ పాము ముడి వేసుకుని ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు దాన్ని తొలగించి అక్కడ తవ్వకాలు జరుపగా అద్భుతమైన ఆలయ గోపురం గోచరించింది. మట్టిని క్రమంగా తొలగించగా ఎకరా విస్తీర్ణంలో ఉన్న ఆలయం బయట పండింది. ఆలయంలోని మూలవిరాట్ శివలింగం నాలుగు అడుగుల ఎత్తులో పానపట్టం ఆరు అడుగుల ఎత్తులో చూడగానే భక్తిభావం కలిగేవిధంగా గోచరించగా అప్పటినుండి గ్రామస్థులు అక్కడే స్థిరపడ్డారు. గ్రామానికి పేరు లేకపోవటంతో పుట్టకు పాము ముడి వేసుకున్న ప్రాంతం కావటంతో కాలక్రమంలో పాముముడిగా, పమిడిగా, పామిడిగా రూపాంతరం చెందింది.*



శ్రీ భోగేశ్వరస్వామి (ఫైల్ ఫోటో )
శ్రీ భోగేశ్వరస్వామికి అలంకారం

***శ్రీ భోగేశ్వరస్వామి మహిమలు..***
*ఆలయంలోని మూలవిరాట్ శ్రీ భోగేశ్వరస్వామి అనేక మహిమలను కనబరిచినట్లు భక్తులు చెబుతుంటారు. భక్తిభావంతో స్వామి వారిని దర్శించుకుంటే కుష్ఠురోగం నయం అవుతుందని, పిల్లలు లేనివారికి సంతానప్రాప్తి కలుగుతుందని నమ్మకం. ఎలాంటి క్లిష్ట సమస్యలు ఎదురైనా స్వామిని పూజిస్తే సమస్యలు తీరుతాయన్నది స్వామిపై వారికున్న నమ్మకానికి నిదర్శనం. స్వామి వారి తీర్థప్రసాదాలు తీసుకున్న ప్రతిఒక్కరి హృదయంలో శ్రీ భోగేశ్వరస్వామి కొలువై ఉంటారని పూర్వీకులు చెబుతుంటారు.*

*శ్రీ భోగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇక్కడ జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. మాఘమాసంలో వేకువజామున ఒక్కపూట మాత్రమే పూజ జరుగుతుంది. శివరాత్రి రోజున ఐదుసార్లు అభిషేకార్చనలను జరుపుతారు. అదేరోజు రాత్రి మహాదేవుని ఉత్సవ విగ్రహం ఉన్న శకటాన్ని రకరకాల పూలతో అలంకరించి విద్యుత్ దీపాల వెలుగులో పట్టణ ప్రధాన వీధులగుండా ఊరేగిస్తారు. భక్తులు, భజన మండలి సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తూ వేకువజాము వరకూ జాగరణ చేస్తారు. రోగగ్రస్తులు ఆలయంలో పూజలు చేస్తే స్వస్థత చేకూరుతుందని ప్రగాఢ నమ్మకం.*

# మోటర్లు, పంపులు పంపిణీ

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
అమరాపురం మండలంలో నీటి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే ,టిటిడి బోర్డు మెంబర్ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో తమడేపల్లి,, వి. అగ్రహారం, మద్దనకుంట, బసవనపల్లి, పంచాయతీ ప్రజలు మొరపెట్టుకున్నారు. దీంతో తక్షణమే స్పందించిన వారు బోర్ వేయించి, మోటర్ పంపులను అందజేశారు శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల సింగిల్ విండో అధ్యక్షులు గణేష్ , నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ ,మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు వారి సమక్షంలో మోటర్ పంపును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండలం సింగల్ విండో ప్రెసిడెంట్ ఎన్ గణేష్ , నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు పి ఎస్. మారుతి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్, కోక్లెస్టర్ చన్నప్ప జయకుమార్ డైరెక్టర్ దాదు పీర్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా టిఎన్టియుసి కార్యదర్శి మంజన్న, రఘు, శకునప్ప గురుసిద్ధప్ప, రాజప్ప, హాలుకూరు డీలర్ హిమంత్ రాజ్, బుతరాజు, మండల కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మోటర్లు పంపులను పంపిణీ చేస్తున్న నాయకులు

# ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి కృతజ్ఞతలు

*నాగోనపల్లి మంజునాథ్..*


**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
కుంచిటిగ, వక్కలిగ కులస్తులను ఓ.బీ.సీ. జాబితాలో చేర్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించినందుకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామికి కుంచిటిగ ఒక్కలిగ సంఘం కార్యదర్శి, సాయి విద్యానికేతన్ కరస్పాండెంట్ నాగోనపల్లి మంజునాథ్ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాగోనపల్లి మంజునాథ్ మాట్లాడుతూ రాష్ట్ర జాబితాలో తమ కులం బి.సి. జాబితా లో ఉందని అయితే కేంద్ర ప్రభుత్వం తమ కులాన్ని ఓ.బీ.సీ. జాబితాలో చేర్పించి పిల్లల విద్య, ఉద్యోగాలలో అవకాశం కల్పించేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఎమ్మెల్సీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషిని మరువ లేమని తెలిపారు. ఆ అసెంబ్లీలో ఒక్కలిగా కులాన్ని కేంద్రం ప్రభుత్వం ఓ.బీ.సీ. లో చేర్పించేలా తీర్మానం చేసి పంపినారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న కుంచిటిగ ఒక్కలిగా సంఘం కార్యదర్శి, శ్రీ సాయి విద్యానికేతన్ కరస్పాండెంట్ నాగోవనపల్లి మంజునాథ్

# మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత

*ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ..*

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా కూటమికి చెందిన మహిళా మంత్రులతో పాటు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తోపాటు సహచర ఎమ్మెల్యేలు శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర బడ్జెట్లో మహిళా శిశుసంక్షేమానికి రూ.4582 కోట్ల,తల్లికి వందనం పథకానికి రూ.9668 కోట్లు,దీపం -2 కు 2601 కోట్లు, స్త్రీ శక్తికి రూ.1420 కోట్లు నిధులు బడ్జెట్లో మహిళ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కూటమికి చెందిన మహిళ ఎమ్మెల్యేలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో అభినందనీయమని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఎం క్యాంప్ కార్యాలయంలో పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తగిన సహాయ సహకారాలు అందించి నిధులు ఇచ్చే ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. బుక్కపట్నం చెరువు లో ఎల్లప్పుడూ నీటితో నింపి చెరువు మధ్యలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లక్షలాదిమంది సత్యసాయి భక్తుల కోరిక అన్నారు.




ఆత్మీయ సభలో పాల్గొన్న నాయకులు బసవనాగి దేవరాయ గురు స్వామీజీ


# ఘనంగా దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణ

## మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..

**మడకశిర/అగలి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మడకశిర పట్టణం ఆర్డీవో కార్యాలయం సర్కిల్‌లో మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి, సాహిత్య వేత్త దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహాన్ని మాల సోదరులు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి , మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, కుంచిటిగ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాల డైరెక్టర్ ఆంజనేయులు, కమలమ్మ, మాజీ ఎంపీ హర్షకుమార్ , బసవ నాగి దేవరాయ గురువులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వేషన్ లేని ముఖ్యమంత్రి సీటులో అధిరోహించిన దళిత జాతి ముద్దుబిడ్డ దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామంలో జన్మించిన సంజీవయ్య అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు రెండుసార్లు నిర్వహించారన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతి నిరోధక శాఖను ప్రవేశపెట్టారన్నారు. కాపు సామాజిక వర్గం కోసం కాపు రిజర్వేషన్ కల్పించిన మహా నాయకుడు అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆకాంక్షలను కొనసాగిస్తూ బలహీనవర్గాల కోసం కృషి చేసిన మహనీయులు దామోదరం సంజీవయ్య లాంటి మహనీయుల జీవిత చరిత్రను రాబోవు తరానికి తెలిసే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేసి మార్గదర్శకాలను రాబోవు తరాలకు తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

అంటరానితనం వివక్షత అణిచివేత వంటి సమయంలో మంచి విద్యావంతులుగా ఎదిగి ఉమ్మడి రాష్ట్ర మంత్రివర్గంలోనూ దేశ మంత్రివర్గంలోనూ పనిచేసి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో మాల కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, పట్టణ కన్వీనర్ నాగరాజు,బిజెపి నాయకులు బసవరాజు, విక్టోరియా మహారాణి, బిజెపి జనసేన టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఆత్మీయ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి


విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి నియోజకవర్గ నాయకులు

# శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

## శివరాత్రి భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ.. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లాలో తిమ్మమ్మ మర్రిమాను, చిల్ల వారిపల్లి కాటి కోటేశ్వర క్షేత్రాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయాల పరిసరాలు, శోభాయాత్ర మార్గాలు, ట్రాఫిక్ మళ్లింపులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి భద్రత చర్యలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బ్యారికేడ్లు, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లు సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం సాయంత్రం బత్తలపల్లి పోలీస్ స్టేషన్ విచ్చేసిన జిల్లా ఎస్పీని బత్తలపల్లి పాత్రికేయులు కలవగా మహాశివరాత్రి పర్వదిన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వచ్చినట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించినట్లు తెలిపారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, అలాగే రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.సమాజంలో శాంతి నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. సమాజ మార్పులో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొంటూ, పోలీసులు చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పోలీసులు పాత్రికేయులు సంయుక్తంగా చేపడితే ఏ కార్యక్రమమైనా విజయవంతమేనన్నారు. ఎస్పీ తో పాటు ధర్మవరం సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్ తదితరులు ఉన్నారు.


పాత్రికేయులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

# పుల్వామా ఉగ్రదాడి వీర జవాన్లకు నివాళులు

## కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ..

**ముదిగుబ్బ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
పుల్వామా ఉగ్రదాడిలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు శనివారం రాత్రి జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ముదిగుబ్బలో ఘనంగా నివాళులు అర్పించారు. దేశభక్తి నినాదాలతో, అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించింది. అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ కూడలిలో వీర జవాన్ల చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాల మౌనం పాటిస్తూ వారి త్యాగాలను స్మరించారు.

ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమన్న ప్రకాష్ మాట్లాడుతూ... దేశ భద్రత కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం అమరులైన జవాన్ల త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత దేశభక్తిని పెంపొందించుకుని, దేశ రక్షణలో తమవంతు బాధ్యతను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు సోమల ప్రకాష్, ఉపాధ్యక్షుడు పసుపులేటి వెంకటేష్, కిసాన్ మోర్చా నాయకులు గంగులప్ప, నారాయణ, శివకుమార్, అశోక్, రాములు, కేశవ, మహేష్, త్రినాథ్, ప్రసాద్, పుల్లప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు, యువకులు, పార్టీ కార్యకర్తలు హాజరై అమర జవాన్లకు నివాళులు అర్పించారు.


జాతీయ రహదారిపై క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కిసాన్ మోర్చా నాయకులు


వీర జవాన్ల చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం


పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# సంత్ సేవాలాల్ జయంతి పోస్టర్లు విడుదల

*మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి*

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి పోస్టర్లను శనివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు బద్రినాయక్,సేవాలాల్ సంఘం నాయకులు, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, కన్వీనర్లు లక్ష్మీ నరసప్ప తిప్పేస్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గం గోర్ బంజారా సంఘం అధ్యక్షులు బద్రీనాయక్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించిన దృశ్యం

# హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మండల పరిధిలో హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కరే గోడ ఈ.వో నరసింహా రాజు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భారీ కేడ్లు ను ఏర్పాటు చేయడం తో పాటు త్రాగునీటి వసతిని కల్పించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై వలి భాష ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్సై వలీబాషా పోలీస్ సిబ్బంది శనివారం శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఐ. రామాంజనేయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై వలీబాష సిబ్బంది

# మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్‌కు సన్మానం

*టిడిపి నాయకులు ..*

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మడకశిరలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ , డైరెక్టర్ దాసరి ఆంజనేయులును టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వారిని సాదరంగా ఆహ్వానించి శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ శ్రీ గుండుమల తిప్పేస్వామి తరపున కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, దాసరి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ఆనంద్ కుమార్, జనసేన పట్టణ అధ్యక్షులు యశ్వంత్ జనసేన, తెలుగుదేశం నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.


కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్‌ను సన్మానించిన టిడిపి నాయకులు

# సామాజిక న్యాయానికి సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట

*మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ..*

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ అమరావతిలో లోని రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ పై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్పందించారు. ఈ బడ్జెట్లో సామాజిక న్యాయానికి ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. సంక్షేమం అభివృద్ధి రెండు సమాన స్థాయిలో అమలు జరిగే విధంగా మెరుగైన బడ్జెట్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర స్థితిగతులను మార్చే బడ్జెట్ ఇది అన్నారు. మరీ ముఖ్యంగా కరువు ప్రాంతమైన రాయలసీమ కరువు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ బడ్జెట్ లో 30 వేల కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించడం ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

# మంత్రాలయం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

*సీఎం చంద్రబాబు హామీ ..*

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
మంత్రాలయం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజాసేవే తమ ధ్యేయమని మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో నియోజకవర్గంలో నెలకొన్న పలు కీలక సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సదుపాయాల విస్తరణ, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వంటి అంశాలపై ముఖ్యమంత్రికి వివరించినట్లు రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, రహదారుల మరమ్మత్తులు, సాగునీటి వనరుల బలోపేతం, విద్యా మరియు వైద్య రంగాల్లో అవసరమైన మెరుగుదలపై దృష్టి సారించినట్లు చెప్పారు.
నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షుణ్ణంగా వివరించగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు. మంత్రాలయం అభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. "మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించినట్లు రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ భేటీతో మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం సమతుల్య బడ్జెట్

*రాష్ట్రానికి దిశానిర్దేశం ..*
*టీడీపీ నేత గవిగట్టు మల్లికార్జున ..*



**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై పెద్దకడబూరు మండల టీడీపీ అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున శనివారం హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమపాళ్లలో సమన్వయం చేసిన ఈ బడ్జెట్ రాష్ట్రానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ -- స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల సమన్వయం కీలకమని తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి రూ.13 వేల కోట్ల కేటాయింపు రాష్ట్ర మౌలిక సదుపాయాల విస్తరణకు ఊతమిస్తుందని అన్నారు. ఈ కేటాయింపులతో అభివృద్ధి వేగం రెట్టింపవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులో 300 ఎకరాల్లో దేశంలోనే తొలి సమగ్ర డ్రోన్ సిటీ అభివృద్ధి, కర్నూలులో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా అహోబిలం అభివృద్ధి, ఏవీఆర్ హంద్రీ – నీవా ప్రాజెక్టు పూర్తికి చర్యలు, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడం, సూపర్ – 6 పథకాలకు భారీగా కేటాయించడం సంతోషకమన్నారు. జిల్లా పోలీసు శాఖకు కొత్త వాహనాలు, పోలవరం – నల్లమల సాగర్ అనుసంధానంపై దృష్టి, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రం సుమారు రూ.9.74 లక్షల కోట్ల అప్పుతో ఆర్థికంగా దెబ్బతిన్నదని, పాత అప్పులు తీర్చేందుకు కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యలను మల్లికార్జున గుర్తు చేశారు. ప్రస్తుతం తీసుకుంటున్న అప్పులు ఉత్పాదకత పెంచే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామన్నారు. 2019 – 24 మధ్యకాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసమే రాష్ట్ర ప్రగతికి ప్రధాన అడ్డంకిగా మారిందని విమర్శించిన ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి స్థిరాభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని తెలిపారు. ఈ బడ్జెట్ రాబోయే రోజుల్లో ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడమే కాకుండా, ముఖ్యంగా రాయలసీమకు కొత్త అవకాశాలను తెరవనుందని గవిగట్టు మల్లికార్జున అభిప్రాయపడ్డారు.

# మాజీ మంత్రి జోగి రమేష్‌కు పరామర్శ

## మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
విజయవాడ ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగీ రమేష్‌ను మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో సుదీర్ఘంగా మాట్లాడి జరిగిన ఘటనలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శ సమయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాజీ మంత్రి జోగీ రమేష్‌కు మనోధైర్యం నింపుతూ, ప్రతికూల పరిస్థితులు తాత్కాలికమేనని ధైర్యం చెప్పారు. సంక్షోభాలను ఎదుర్కొనేందుకు అవసరమైన ధైర్యం, సహనం అవసరమని సూచించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ మీకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు.



మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మాజీ మంత్రి జోగి రమేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

అదేవిధంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యుల మనోభావాలను తెలుసుకుని, ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజా జీవనంలో అనుకోని పరిణామాలు సహజమని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ "ప్రజా నాయకుల జీవితంలో ఇలాంటి సవాళ్లు సహజం. మనోధైర్యాన్ని కోల్పోకుండా నిలబడితే ప్రతి క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడవచ్చు. త్వరలోనే మంచి రోజులు వస్తాయి" అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సందర్శనతో మాజీ మంత్రుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణుల్లో ఈ పరామర్శకు విశేష ప్రాధాన్యత ఏర్పడింది.



శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ పూజారి నరసింహులు

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

## టీడీపీ సీనియర్ నాయకులు మద్దిలేటి మధుసూదన్ రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పనులకు పెద్దకడబూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మద్దిలేటి మధుసూదన్ రెడ్డి రూ. 10,016 నగదును విరాళంగా అందజేశారు. శనివారం మధుసూదన్ రెడ్డి శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త నల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడానికి దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం గ్రామ ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడానికి తన వంతు సహకారం అందజేస్తానని స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణం భక్తుల సహకారంతో ముందుకు సాగుతోందని ధర్మకర్త నల్లారెడ్డి తెలిపారు. భక్తుల నుంచి అందుతున్న విరాళాలు, సేవలతో ఆలయ పనులు వేగంగా జరుగుతున్నాయని, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాన్ని సమగ్రంగా చేపడుతున్నామని వివరించారు. విరాళం అందజేసిన మధుసూదన్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోనుమాను



శ్రీ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న టీడీపీ నేత మధుసూదన్ రెడ్డి



# సీమ ప్రయోజనాలకు మేలైన బడ్జెట్

## ఎమ్మెల్యే కాలవ హర్షం..

**రాయదుర్గం, డి.హీరేహాల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
వెనకబడ్డ రాయలసీమ, మరీ ముఖ్యంగా అనంతపురం జిల్లాకు ప్రస్తుత బడ్జెట్ ద్వారా మెరుగైన ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీమ సాగు నీటి ప్రాజెక్టులు మరింత వేగాన్ని అందుకుంటాయని అభిప్రాయపడ్డారు. అనంత జీవనాడి తుంగభద్ర ఎగువ కాలువ పటిష్ట పరచడంతో పాటు హంద్రీనీవాను ముందుకు తీసుకెళ్లడం వల్ల సక్రమ సాగునీటి సరఫరా వీలవుతుందన్నారు. సాగు జలాలు పెరగడం ద్వారా రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని మరింత వేగవంతం చేసేందుకు దోహదపడుతుందన్నారు. పూర్వోదయ పథకం ద్వారా రాబోయే ఐదారేళ్లలో పండ్ల తోట్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.30వేల కోట్లు కేటాయించనుందన్నారు. ఈ నిధుల్లో ఎక్కువ శాతం ఉపయోగించుకోవడం ద్వారా పండ్ల తోటల విస్తరణ త్వరితగతిన చేపట్టవచ్చున్నారు. తద్వారా పండ్ల ఎగుమతులు పెరిగి అంతర్జాతీయ స్థాయిలో మన రైతులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ముఖ్యంగా సీమ జీవనాడిగా పిలుస్తున్న హంద్రీనీవాకు ఈ బడ్జెట్లో రూ.3158 కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతపురం జిల్లాలో ప్రధానంగా వెనుకబడ్డ రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు నియోజకవర్గాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు చేపట్టిన జీడిపల్లి –భైరవానితిప్ప, జీడిపల్లి –పేరూరు ప్రాజెక్టు పనులు వేగాన్ని అందుకొని నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా చేరుకోవడానికి అవకాశం లభిస్తోందన్నారు. గత ఏడాది స్టేజ్ వన్ విస్తరణ పనులకు రూ.3000 కోట్లు ఖర్చు చేయడం ద్వారా 150 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 40 టీఎంసీలకు పైగా నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. ఇది కరువు సీమకు పెద్ద ఊరట నిచ్చిందన్నారు. సీమలో వర్షాలు సమృద్ధిగా కురువకపోయినా, నేటికీ అనేక సాగునీటి ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. వాటి కింద వేలాది ఎకరాల సాగుతో పాటు పండ్ల తోటల విస్తరణకు దోహదపడుతున్నాయన్నారు. ఈ ఏడాది కూడా బడ్జెట్లో రూ.3158కోట్లు కేటాయించడంతో మిగిలిన పనులు వేగాన్ని అందుకొని మరింత ఎక్కువ నీటిని తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అలాగే తుంగభద్ర ఎగువ కాలువ నిర్వహణ కింద బడ్జెట్లో రూ.50 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. గత ఏడాది రూ.30 కోట్లు ఖర్చుపెట్టి బలహీనంగా ఉన్న కాలువ లైనింగ్, రోడ్డు వంతెనలను కొత్తగా నిర్మించడం జరిగిందన్నారు. దాంతో చాలా వరకు కాలువ కోతకు గురి కాకుండా సకాలంలో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందించగలిగామన్నారు. మిగిలిపోయిన మరికొన్ని ప్రాంతాల్లో కాలువ పటిష్టతకు ప్రస్తుత బడ్జెట్ నిధులు ఉపయోగపడతాయన్నారు. సీమ ప్రయోజనాలు కాపాడే విధంగా బడ్జెట్ కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# విలువలతో కూడిన విద్యా ప్రమాణాలు అవసరం

## విద్యతోనే ఉన్నత స్థాయికి.. ఘనంగా విద్యానికేతన్ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు..

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
విద్యతోనే ఉన్నతస్థాయి విలువలతో కూడిన సంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థులకు అలబడతాయని వక్తలు ప్రశంసించారు. కనేకల్ పంచాయతీ పరిధిలోని కణేకల్ క్రాస్ లో ఉన్న విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో పెద్దపెద్ద బోర్డులు, ఫ్లెక్సీలతో, విద్యుత్ బల్బులతో డీజే మ్యూజిక్స్ సిస్టంతో సభా వేదికను ఏర్పాటు చేసి చిన్నారులతో సాంగ్స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఈడి లక్ష్మన్న ఉప్పర సహకార సంఘం చైర్మన్ ఆనంద రాజ్ లు మాట్లాడుతూ విద్యతో పాటు మంచి సంస్కృతి సాంప్రదాయాలు అత్యున్నతమైన విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని అన్నారు. 25 సంవత్సరాల నుండి పాఠశాల అంచలంచలుగా అభివృద్ధి పరిస్థితి అరెస్పెండెంట్ రవికుమార్ అత్యున్నతమైన విలువలతో కూడిన విద్యను అందిస్తూ పాఠశాల విలువలను కాపాడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి విద్యార్థికి ఉన్నత విలువలు లతో కూడిన విద్య అవసరమని గుర్తించి నిరుపేదలైన పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారన్నారు. విద్యానికేతన్ పాఠశాల అంటే లలో ఒక ఉన్నత విలువలు కలిగిన పాఠశాల అని గుర్తింపు తెచ్చారన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ కుటుంబ సభ్యుల సైతం చేదోడు వాదోడుగా ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తారని ఆశాభావం వ్యక్తపరిచారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రుల సైతం పిల్లలకు మొదటి గురువుగా ఉండి మంచి మార్గంలో పిల్లలను విలువలతో కూడిన సంస్కృతిని,సాంప్రదాయాన్ని అలవర్చాలన్నారు.
విద్యార్థులు తప్పు ద్రోవలో వెళ్లకుండా తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉందన్నారు. కరెస్పాండెంట్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో కుటుంబ సభ్యుల సహకారంతో 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుక లు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సక్రమ మైన మార్గంలో నడిపి విద్యను అందించడంలో ఉపాధ్యాయుల సహకారం, మా సిబ్బంది సహకారం చాలా ఉందన్నారు. ఉపాధ్యాయులను, సిబ్బందిని మా సొంత ఇంటి మనుషుల్లా చూసుకోవడం వల్లనే మేము ఈ అద్భుతమైన ఘనత సాధించామన్నారు. అదేవిధంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు గారి తనయుడు కాలవ భరత్ ఈ వేడుకల్లో పాల్గొని సనాతన ధర్మంతో కూడిన సాంప్రదాయ నృత్యాలతో పాటు ఈనాటి తరానికి ఇష్టమైన పాటలతో విద్యార్థినిల నృత్యాలను తిలకించారు. ఈ వేడుకలకు అనేక ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు బంధువులు కు సైతం తాగునీటి సౌకర్యం భోజన సౌకర్యాలు ఉచితంగా విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం ఏ లోటు లేకుండా సమకూర్చారు.



సంప్రదాయ వేషధారణలో విద్యార్థినిలు.



సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు . చిన్నారుల నృత్య భంగిమలు

# శివాలయాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

*ఎస్సై నాగ మధు..*

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివాలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నాగమధు ఆలయ ధర్మకర్తలు, ఆలయ పెద్దలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వచ్చే అవకాశం ఉన్నందున దర్శన ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా భక్తులకు సులభంగా మరియు సురక్షితంగా దేవుని దర్శనం కల్పించే విధంగా క్యూ లైన్లు, తాగునీరు, లైటింగ్, శుభ్రత వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే ఆలయ ప్రాంగణం చుట్టూ ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని, అవసరమైన చోట వాలంటీర్లు మరియు సిబ్బందిని నియమించాలని ఆలయ ధర్మకర్తలు, పెద్దలకు సూచించారు. శివరాత్రి రోజు ఐదు శివాలయాల దర్శనం ఎంతో పుణ్యం అన్నారు.భక్తుల సహకారం కూడా ఎంతో ముఖ్యమని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటు మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై నాగ మధు కోరారు.



శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కనేకల్ ఎస్సై నాగ మధు

# చెన్నకేశవ స్వామి ఆలయంలో పరిశుభ్రత పనులు

## డిప్యూటీ ఎంపీడీవో శశికళ..

**యాడికి, (తెలుగోడు), ఫిబ్రవరి 14:**
యాడికి మండల కేంద్రంలో వెలిసిన శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో డిప్యూటీ ఎంపీడీవో శశికళ సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఆలయం ఆవరణలో కిందికి ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి ఆలయ ఆవరణ అంతా శుభ్రపరిచారు.
అనంతరం ఇంటి పన్ను కొళాయి పన్ను బిల్ కలెక్టర్ చేస్తున్న వాటిని పరిశీలించారు. బిల్ కలెక్టర్లు ఇంటింటి వద్దకు వెళ్లి పన్ను వసూలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఆదివారంలోగా 100 శాతం పన్నులు పూర్తి చేయాలన్నారు.



యాడికిలో ఇంటిపన్ను వసూళ్లను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శశికళ



శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం ఆవరణలో పరిశుభ్రత చర్యలను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శశికళ

## నిలిచి ఉన్న లారీని ఢీకొన్న గ్యాస్ లారీ

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మండల పరిధిలోని గంగాదేవి పల్లె సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో నిలిచి ఉన్న లారీని గ్యాస్ తీసుకెళుతున్న మరో లారీ ఢీకొని డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు గంగాదేవి పల్లె సమీపంలోని హుబ్లీ కృష్ణపట్నం 67వ జాతీయ రహదారిలో శనివారం తాడిపత్రి వైపు వెళ్లేందుకు నిలిచి ఉన్న ఓ లారీని అదే వైపు గ్యాస్ ను తీసుకెళ్తున్న లారీ ఢీకొనడంతో డ్రైవర్ సుబ్బరాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం 108 కు తెలియడంతో హుటాహుటిన వెళ్లి గాయపడిన డ్రైవర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



## వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో పెద్ద పీట

### ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
రాయలసీమ స్థితిగతులు మార్చే విధంగా ఏపీ బడ్జెట్ ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆమె హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలోని మహిళా ఎమ్మెల్యేలతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను కలిశారు. బడ్జెట్ లో పలు రంగాలకు కేటాయింపులపై ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30వేల కోట్లు కేటాయింపుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీని వలన అనంతపురం జిల్లాకు అత్యధికంగా మేలు చేకూరే అవకాశం ఉందన్నారు. జిల్లాలో హార్టికల్చర్ పంటలు ఎక్కువగా సాగవుతున్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కేటాయింపుల ద్వారా రైతులకు పెద్ద ఎత్తున మేలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇక్కడి నుంచి ఎగుమతులు, పండ్ల ఆధారిత పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉందన్నారు. మరోవైపు వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయించడం కూడా మంచి పరిణామం అన్నారు. దీని ద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదం కానుందన్నారు. పంచాయతీరాజ్ శాఖకు రూ.22,942 కోట్లు కేటాయింపుల వలన గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేసినట్టైందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందన్నారు. జల వనరుల శాఖకు రూ.18,224 కోట్లు కేటాయించడం వలన ప్రధాన ప్రాజెక్టులు దాదాపు పూర్తి చేసే పరిస్థితి ఉందన్నారు. గృహ నిర్మాణ శాఖకు రూ.6357 కోట్లు కేటాయింపుతో ఈ ఏడాది ఇళ్ల నిర్మాణాలు వేగవంతగా సాగుతాయన్నారు. జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయింపుల వలన రాప్తాడు నియోజకవర్గం వంటి ప్రాంతాల్లో జరుగుతున్న పనులు పూర్తవుతాయన్నారు. మరోవైపు సంక్షేమ

## సుండుపల్లిలో మహా ప్రక్షాళన ..

### అభివృద్ధికి నడుం బిగించిన చప్పిడి సోదరులు .. తీరనున్న ట్రాఫిక్ కష్టాలు .. అభివృద్ధి సహకరిస్తున్న పురప్రజలు ..

**టి.సుండుపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
చిన్న వర్షం పడితే చాలు పొంగిపొర్లే మురుగు కాలువలు, వాటిపైన అడ్డగోలు కట్టడాలు, ఇరువైపులా ప్రధాన రహదారిని ఆక్రమించి వాహనాల రద్దీ వలన ప్రయాణాలను అస్తవ్యస్తం చేసే చిరు వ్యాపార సముదాయాలు. ఇవి ఇన్ని రోజులు కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని టి.సుండుపల్లె మండల కేంద్రంలోని దుస్థితి. అడ్డగోలు పంచాయితీ పాలనలో గ్రామ అభివృద్ధి సంగతి దేవుడెరుగు కనీసం సరైన పారిశుద్ధ్య వ్యవస్థలేని దుర్భర స్థితిలో సుండుపల్లి పంచాయతీ పాలన తూతూ మంత్రంగా సాగుతున్న పరిస్థితుల నుంచి ప్రజలకు పారిశుధ్యం, వాహనాల రద్దీ సమస్యల నుండి విముక్తి కలిగే దిశగా కూటమి



మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న దృశ్యం



పనులను పర్యవేక్షిస్తున్న చప్పిడి మహేష్ నాయుడు

ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటున్నారని పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు సారధ్యంలో సుండుపల్లె పారిశుధ్యాన్ని ప్రక్షాళన చేసే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. గ్రామంలో మురుగు కాలువలను ఆక్రమించి కట్టిన అక్రమ కట్టడాలని తొలగించి గ్రామాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బందితో కలిసి చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చప్పిడి సోదరులు తెలిపారు. రోడ్డుని ఆక్రమించడం వల్ల గ్రామ అభివృద్ధి జరగదని, రోడ్డుపై చిరు వ్యాపారులకు సైతం ప్రత్యామ్నాయ మార్గం చూపిస్తున్నాం అని, గ్రామ అభివృద్ధి కి ఆటంకం కలగకుండా ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలని చప్పిడి సోదరులు కోరారు. మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధితో మొదలైన గ్రామ అభివృద్ధి మరింత ముందుకు తీసుకొని వెళ్తామని వారు అన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తున్నామని చప్పిడి సోదరులు అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి

### ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందాలని ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సింగసముద్రం, కెంచన బల్ల, రామకుప్పం గ్రామపంచాయతీలో టిడిపి కుటుంబ సాధికార సభ్యులుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలన్నారు. పథకాలను ప్రజలకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలి అన్నారు. కుటుంబ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, జిల్లా నేత నారాయణ చారి, మండల అధ్యక్ష మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు సీతాపతి,రామ్మూర్తి, విశ్వనాథ్, రఫీ, రవి రెడ్డి,జయశంకర్, రఘు, చంద్రశేఖర్ రెడ్డి, సత్తి,అవినాష్ రెడ్డి, శంకరాచలం, బాలరాజు, సుబ్రి, ఆదిల్, మంజునాథ్, సురేష్, అలివేలమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న కూటమి నేతలు

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మండలంలోని కెంచన బల్ల గ్రామంలో ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు స్థానిక నేతలతో కలిసి సీఎం సహాయ నిధి చెక్కును బాధితులకు అందజేశారు. శనివారం కెంచనబల్ల లోని రాజేష్ కి 67 వేల రూపాయల చెక్కును అందజేశారు. అనారోగ్య సమస్యలుతో వైద్య చికిత్సలు అందించుకున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం లాంటిది అన్నారు. రాష్ట్రంలో వేలకోట్ల రూపాయల నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించి ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, కడ సభ్యుడు రఘు, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, సత్తి, శంకరాచలం,అవినాష్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపు నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

### ఎక్సైజ్ సీఐ విన్నీలత..

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న సింహాద్రిపురం మద్యం షాప్‌కు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ విని లత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏడు మద్యం షాపులలో సింహాద్రి పురానికి చెందిన ఓ మద్యం షాప్ యజమానులు, కొన్ని రోజులుగా మద్యం విక్రయానికి ఆసక్తి చూపకపోవడంతో మరో ఇతర కారణాల వలననో మూసి వేయబడినదితెలిపారు. అయితే ఫిబ్రవరి 23 నుండిఉన్న ఆ మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ విన్నీలతా తెలిపారు. మద్యం షాపు కొరకు దరఖాస్తులు చేసుకునేవారు ఆన్లైన్లో కానీ ఆఫ్లైన్లో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే ఫిబ్రవరి 23 నుండి సెప్టెంబర్ నెల ఆఖరి వరకు దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. అయితే ప్రభుత్వ ఎక్సైజ్ నిబంధనలు వర్తిస్తాయని, మరింత సమాచారం కోసం9440902604 ఎక్సైజ్ నెంబర్ సంప్రదించాలని తెలిపారు.

## రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

### మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబు నాయుడు..

**ఉదయగిరి/కొండాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
కొండాపురం మండలం గారిమెనపెంట పంచాయతీ చల్లగిరగల నుండి గజ్జలవారిపల్లె వరకు 86 లక్షల నిధులతో మంజూరు అయిన రోడ్డు పనులకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో శనివారం నాడు స్థానిక తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పోలినేని చంద్రబాబు నాయుడు, యేరువ కృష్ణయ్య ,అల్లిక మధు (సొసైటీ చైర్ పర్సన్), పోలినేని రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్జలవారి పల్లి గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని విద్యార్థులు చేపట్టిన నిరసన సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన విద్యార్థుల కష్టాలను జిల్లా కలెక్టర్ హిమానుస్ శుక్లా, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ద్వారా తెలుసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో 86 లక్షల రూపాయల జి రాంజీ నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , జిల్లా కలెక్టర్ హీమాన్షు శుక్లా సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు.



రహదారి పనులను ప్రారంభిస్తున్న నాయకులు



రహదారి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

దత్తలూరు మండలంలో ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింతగా పెరగడం ద్వారా స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. 18 నెలల పాలనలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో కొండాపురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు రహదారులు, పాఠశాలలు, హాస్టళ్లు, పాడి రైతులకు మినీ గోకులాలు, నీటితోట్లు, చెరువుల ఆధునీకరణ పనులు, కాలవలు మరమ్మతులు నూతన తారురోడ్లు మంజూరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మండలానికి అత్యధిక నిధులు మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు దక్కుతుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని అందులో కొండాపురం మండలంలో పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపాటి శ్రీనివాసులు, నందా మాచర్ల, డేగ కృష్ణ,కంచుపాటి రమణయ్య,డిఈ మణికుమార్, ాజు, బూత్ కన్వీనర్ లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లా అన్నదానం ప్రశంసనీయం

### నిరంతరంగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాలు .. పలువురు హర్షం ..

**ప్రొద్దుటూరు (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
నెల కాదు రెండు నెలలు కాదు ఆరు నెలలు కాదు నాలుగు సంవత్సరాల తరబడి నిరంతరంగా పేదవాళ్ళకి పట్టెడన్నం పెట్టడంలో ఆయన గుణవంతుడు పేదల పాలిట పెన్నిధిగా ప్రశంసనీయుడుగా చల్లా రాజగోపాల్ యాదవ్ నిలిచిపోయారు. ప్రొద్దుటూరు పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ గత నాలుగేళ్లుగా ప్రతి శనివారం,పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ప్రశంసనీయమని ప్రజలు కొనియాడారు. శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 1000 మంది పాల్గొని రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని ఆరగించి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా నిరుపేదల ఆకలిని తీరుస్తున్న చల్లా రాజన్న అభినందనీయుడని వారు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచేలా భగవంతుడు ఆయనకు అన్ని రకాలుగా శక్తిని,ఆయుర ఆరోగ్యాలు ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఇంత పెద్ద ఎత్తున అన్నదానం చేయడం ఎక్కడా లేదని వారు పేర్కొన్నారు . ఇప్పటికే చల్ల రాజగోపాల్ యాదవ్ చేస్తున్న అన్నదాన కార్యక్రమం అందరిలో నానుతోందన్నారు. పల్లె, పట్టణ వాసులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రొద్దుటూరుకు వచ్చే ప్రతి ఒక్కరు చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నదానాన్ని ఆరగిస్తున్నారు. ఆయన అన్నదానం ప్రతి ఒక్కరిలో ప్రశంసలు కురిపిస్తోంది.



అన్నదానం నిర్వహిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్



ప్రజలతో కలిసి భోజనం చేస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్

ఏది ఏమైనా ప్రొద్దుటూరు పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడమే కాకుండా అనునిత్యం ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం అర్హనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, చల్లా రవిశంకర్ యాదవ్, బంగి శివప్రసాద్, మూరబోయిన శ్రీనివాసులు యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, టైలర్ ప్రసాద్, కర్ణ యాదవ్, హరి, యేసునాథ్ రెడ్డి,పూల బాష, రవి, డ్రైవర్ భాష, తదితరులు పాల్గొన్నారు

## గ్రామ కంఠం భూమే కదా.. పాగా వేసేద్దాం...

### వైసీపీ నాయకుల బంధువుల ఆక్రమణ యత్నం ..

**ఉదయగిరి/వరికుంటపాడు (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
వరికుంటపాడు మండలం తూర్పు రొంపి దొడ్ల గ్రామ పంచాయతీలో ఊరు నడిబొడ్డున సచివాలయాన్ని ఆనుకొని ఉన్న విలువైన గ్రామ కంఠం భూమిని వైసీపీ నాయకుల బంధువులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. విలువైన పంచాయతీ భూములను కాపాడాల్సిన పాలకులు ఇల్లు లేని నిరుపేదలు అని చెప్పుకుంటూ వైసీపీ నాయకుల బంధువులకు విలువైన పంచాయితీ భూములను చదును చేసి అక్రమ లేఔట్‌లు వేసి దోపిడీలకు పాల్పడుతున్నా పంచాయతీ అధికారులు మేనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో సర్వేనెంబర్ 259/1- 20 సెంట్లు., 208/3- 1.30 ఎకరా 30 సెంట్లు భూమి గ్రామ కంఠం భూమి అని నిర్ధారించి అక్రమార్కులు ఏ విధమైన నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు పెట్టారు. అయితే నేడు యదేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా మండల అధికారులు, పంచాయతీ పాలకులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా అనేకమంది సర్పంచులు ఎన్నికైనప్పటికీ భవిష్యత్తు అవసరాల కోసం కాపాడిన భూములు ప్రస్తుతం పాలకులు అక్రమాలకు పాల్పడుతూ వైసిపి నాయకుల బంధువులకు ధారాదత్తం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయతీ భవిష్యత్తు అవసరాల కోసం విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుచున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
దీనిపై స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు యువనేత మారినేని రామకృష్ణ, మల్లంపాటి కొండలరావు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతో అనువుగా ఉన్న స్థలం అయినందున ఇక్కడే స్వర్ణ వార్డు కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్రం నిర్మించారన్నారు. అలాగే ఈ విలువైన భూమిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ భవిష్యత్తు అవసరాలు, ప్రభుత్వ కార్యాలయాల కోసం ముఖ్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో పశువైద్యశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ ఆమోదం పరిధిలో పరిశీలనలో ఉన్నాయన్నారు. త్వరలోనే ఆమోదం పొంది పశు వైద్యశాల కార్యాలయం ఆర్ అండ్ బి రహదారిని ఆనుకొని ఉన్న భూమిలో నిర్మించడం ద్వారా పశు వైద్య



మాట్లాడుతున్న యువ నేత మార్నేని రామకృష్ణ, మల్లంపాటి కొండలరావు

పరిధిలోని గ్రామాల రైతులు వైద్య చికిత్సల కోసం రావడానికి అనువుగా ఉంటుందన్నారు. అలాంటి స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో పంచాయతీ ఆధ్వర్యంలో మార్కెట్ సదుపాయం, గ్రంథాలయం నిర్మాణం, తదితర భవిష్యత్ అవసరాల కోసం ఈ భూమిని కాపాడాలని గతంలోనే శాసనసభ్యులు కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గతంలో గ్రామ కంఠం భూమిని భవిష్యత్తు అవసరాల కోసం కాపాడాలని మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

**_ఇల్లు లేని వారికి ఇంటి స్థలాలు.. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి_**

ఇల్లు లేని నిరుపేదలు సచివాలయం ద్వారా నమోదు చేసుకున్నట్లయితే మండల రెవెన్యూ అధికారులు పరిశీలించి అర్హత కలిగిన ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా మూడు సెంట్లు భూమి ఇంటి స్థలం పట్టా మంజూరు చేస్తారని యువనేత మారినేని రామకృష్ణ, మల్లంపాటి కొండలరావు తెలిపారు. గ్రామంలోని అర్హులైన ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ సహకారంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంటి స్థలం పట్టాలు మంజూరు చేసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన దృశ్యం



స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తున్న
శ్రీశైల ంజగద్గురు శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామశివాచార్య

# మల్లన్న సేవలో శ్రీశైలం జగద్గురు శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ శివాచార్య

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
ప్రముఖ శైవక్షేత్రంగా శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల జగద్గురు శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామశివాచార్య మహాస్వామి శనివారం ఉదయం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు వీరికి అమ్మవారి ఆశీర్వచనం మండపంలో స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అర్చక స్వాములు అందించారు వీరితోపాటు ఆలయ అధికారులు అర్చక స్వాములు ఉన్నారు



శ్రీశైల జగద్గురు శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామశివాచార్య స్వామివారిని సన్మానిస్తున్న ఆలయ అధికారులు అర్చకులు

# ఐక్యంగా పోరాటం చేసి ఆర్డిటిని కాపాడుకుందాం

### సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్టేబుల్ సమావేశం

**అనంతపురం రూరల్ (తెలుగోడు) , ఫిబ్రవరి 14 :**
ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరించాలని, ఆర్డిటిని కాపాడుకుందాం అని నాయకులు అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ప్రెస్ క్లబ్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి, సిపిఎం, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఎస్సీ ఎస్టీ సంఘాలు విద్యార్థి యువజన కార్మిక మహిళ సంఘాలు పాల్గొన్నారు ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోనూ మరియు ముఖ్యంగా అనంతపురం జిల్లాలోనూ ప్రజలకు సేవ చేస్తున్న ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు జిల్లాలో ఉన్నటువంటి మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు అఖిలపక్ష పార్టీల నాయకులు అందరూ ముక్తకంఠంతో ఒకే నినాదంతో ఆర్డీటీ సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుసార్లు వినిపించిన, ఇప్పటివరకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆర్డిటి సంస్థకు సంబంధించిన అకౌంట్ రెన్యువల్ చేయలేదని పేర్కొన్నారు. దానివల్ల విదేశాల నుంచి వచ్చే నిధులు ఆర్డిటి సంస్థకు రావడంలేదని తెలిపారు. ఆర్డిటి సంస్థకు కున్న సొంత స్థలాలను అమ్ముకుంటూ ఆసుపత్రులు కూడా మూతి వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే ఆర్డిటి సంస్థలో పనిచేస్తున్న కార్మికులను తొలగించారని తెలిపారు.. ఆర్డిటి సంస్థ వల్ల ఈ జిల్లాలో ఎంతోమంది పేద ప్రజలు ఇల్లు నిర్మాణం చేశారన్నారు వాటితో పాటు పేద మధ్యతరగతి విద్యార్థులలో ఉన్నటువంటి ఆటలను వెలికి తీసి జాతీయ అంతర్జాతీయ స్థాయికి విద్యార్థులను తీసుకెళ్లినటువంటి ఘనత ఆర్డిటి సంస్థ ఉందన్నారు. జిల్లాలో పేదలకు ఆర్డిటి సంస్థ వైద్యం అందిస్తుందని పేర్కొన్నారు.. కేంద్ర ప్రభుత్వం ఆర్డిటి సంస్థకు సంబంధించిన ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయకపోవడం వల్ల విదేశాల నుంచి వచ్చేటువంటి నిధులు రావడం లేదన్నారు ఆర్డిటి సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్నిండు గాని కేంద్ర ప్రభుత్వం నుండి గాని నిధులు అడగలేదన్నారు.. త్వరలో సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించడం జరిగిందన్నారు వాటితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మరియు ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మాజీ ముఖ్యమంత్రివర్యులు కలసి వినతి పత్రాలు ఇవ్వాలని తీర్మానించిందన్నారు. ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ ను రెన్యూవల్ చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అఖిలపక్ష పార్టీల నాయకులు తెలిపారు.. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప జడ్పీ చైర్మన్ గిరిజమ్మ నగర మేయర్ వసీం వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్ తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు సుధాకర్ యాదవ్ మతవల్లి సంఘం రాష్ట్ర అధ్యక్షులు షకీల్ షఫీ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ కిష్ట సిపిఐ ఎమ్మెల్ లిబరేషన్ వేమన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు మల్లికార్జున రాజారెడ్డి వి కే మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ వికె రంగారెడ్డి మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు షేక్ న్నా, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి పద్మావతి జిల్లా కార్యవర్గ సభ్య రమణయ్య రాజేష్ సంతోష్ పాల్గొన్నారు.



# ఆర్డీటికీ ఎఫ్సీఆర్ఏ పునరుద్ధరించని నేతలు రాజీనామా చేయాలి

సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చామని చెబుతున్న నాయకుల మాటలే నిజం అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది ప్రజలకు 60 సంవత్సరములుగా సేవ చేస్తున్న ఆర్డిటికి



ఎఫ్‌సి ఆర్ఏ రెన్యూవల్ చేయించలేని కారణంగా ప్రజా ప్రతి నిధులందరూ సామూహికంగా రాజీనామా చేయాలి కదా, చేయలేదంటే రాజకీయాలలో సేవ లేదనే కదా!

కుల,మతాలకు అతీతంగా లక్షలాదిమంది ప్రజలకు సేవ చేస్తున్న ఆర్‌డిటి సంస్థను నిలబెట్టు కోవడం కంటే పెద్ద సేవ ఏముంటుందో ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు చెప్పగలరా.

కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రధాన భూమిక పోషిస్తున్న రాష్ట్ర కూటమి పార్టీలు,ఆ దిశగా ప్రయాణం చేయలేదంటే నేతిబీరలో నెయ్యి ఉన్నట్లే వీరి రాజకీయాలలో కూడా సేవ ఉన్నదని అర్థమవుతుంది. వీరి ప్రయత్నం లోపం లేకపోతే ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ అయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఈ సంస్థను నడిపే బాధ్యత తీసుకోవాలి. అందుకు తక్షణం ఆర్డిటి సేవలు కొనసాగింపు కోసం 100 కోట్లు కేటాయించాలి. అలాంటి నిర్ణయం తీసుకోక పోగా, ఇక్కడి ప్రజలు ఆర్డిటిని కాపాడుకోవడానికి ఉద్యమ కార్యాచరణ ప్రారంభించిన వెంటనే తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు ఢిల్లీ పెద్దలకు లెటర్లు ఇస్తున్నట్లు వార్తలు గుప్పించడం వెనక దాగి ఉన్న రహస్యం ఏమిటి. దీనిని బట్టి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుంది.

అందరి మంచి కోసం పనిచేసే ఆర్డిటి సంస్థను నిలబెట్టుకోవడం మనందరి ప్రథమ కర్తవ్యం. అందుకే కుల మత,పార్టీలకు అతీతంగా ఐక్యమై,చేతగాని ప్రజా ప్రతినిధుల కన్నులు తెరిపించే విధంగా పోరాటాలకు సిద్ధమవుదాం,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, మరియు 2029 సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తాం, జనజీవనాన్ని స్తంభింప చేస్తా మని హెచ్చరిద్దాం,తద్వారా ప్రభుత్వం మెడలు వంచి ఆర్డిటి కి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయించుకుందాం. రండి,కదలి రండి,తరలి రండి,చేయి చేయి కలపండి, ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం రండి.

**– కె.వి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,**
**వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.**







ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చక స్వాములు . విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం


# గజవాహనంపై గరళకంఠుడు

## కన్నుల పండువగా గ్రామోత్సవం ..

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నాడు స్వామి అమ్మవార్లు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం సాయంకాలం ఉభయ దేవాలయాల యాగశాలలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం సాయంకాలం అక్కమహాదేవి అలంకరణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో నూతన వస్త్రాలతో అలంకరింపజేయించి అలంకరణ పూజలను అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మరొకమారు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు మహా మంగళారతులు వచ్చి మేళ తాళాలు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైలం



విద్యుత్ దీపాల వెలుగులో రాజగోపురం

నడుమ మంగళ వాయిద్యాలు నడుమ విద్యుత్ దీప కాంతుల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవం శ్రీశైలం పురవీధుల్లో ఎంతో వైభవంగా ముందుకు సాగింది. ఈ గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులకు అడగడు గున శివ స్వాములు శివ భక్తులు కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి దంపతులు ఆలయ అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం







విన్యాసాలు చేస్తున్న కళాకారులు









పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# మెట్ల మార్గం ద్వారా వెళ్లే భక్తులు జాగ్రత్తగా ఉండాలి

## నదిలో బోటు నడిపే నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి.. పాతాళ గంగ వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన.. జిల్లా ఎస్పీ సునీల్ శరాన్ ..

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాతాళ గంగ వద్ద ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ శరాన్ పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పాతాళగంగ మెట్ల మార్గం గుండా నడిచివెళ్లి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశం వరకు చేరుకున్న అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా



పాతాళ గంగ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సునీల్ శరాన్

ఉన్నందున మెట్ల మార్గం ద్వారా భక్తులు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. పుణ్యస్నానాలు ఆచరించు భక్తులు అధికారులు ఏర్పాటు చేసిన భద్రతా నిబంధనలు ఉల్లంఘించి ముందుకు వెళ్లరాదన్నారు. బోట్ల ద్వారా ప్రయాణికులను విహారయాత్రకు తీసుకువెళ్లే బోటు నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి ఒక్క ప్రయాణికుని భద్రత , రక్షణను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. లైఫ్ జాకెట్ వేసుకున్న తర్వాతనే ప్రయాణం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సునీల్ శరాన్







పాతాళ గంగ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సునీల్ శరాన్

# తెలుగు ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు

### మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి .. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. .

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
శివరాత్రి పర్వదినాన మీరు మీ కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో గడపాలని కోరుకుంటూ తెలుగు ప్రజలందరికీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మహాశివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగను ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకొని జీవితాంతం ఆయురారోగ్యాలతో జీవితాన్ని గడపాలని మహా శివుని ఆశీస్సులు ఎల్లప్పుడూ మనందరిపై ఉండాలని పరమేశ్వరుని కోరుకున్నట్లు తెలిపారు

# ప్రజా రంజక బడ్జెట్

### పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ..

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 14 :**
కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అభివర్ణించారు. రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాయలసీమ స్థితిగతులను మార్చే బడ్జెట్ అని కొనియాడారు. ముఖ్యంగా రాయలసీమను కరూర్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మరియు రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు సుమారు 30 వేల కోట్లు బడ్జెట్లో కేటాయించడం ఎంతో అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్లో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు అంతేకాకుండా వ్యవసాయానికి 12 172 కోట్లు అన్నదాత సుఖీభవ పథకానికి 6600 కోట్లు హార్టికల్చర్ కు 1123 కోట్లు పశుసంవర్ధక 1121 కోట్ల కేటాయించడం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమానికి 20 644 కోట్లు ,ఎస్టి సంక్షేమానికి 9190 కోట్లు, బీసీ సంక్షేమానికి 51021 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 690 కోట్లు మహిళా శిశు సంక్షేమానికి 4582 కోట్లు తల్లికి వందనం 9668 కోట్లు, జల జీవన్ మిషన్ కు 4000 కోట్లు ఎన్టీఆర్ వైద్య సేవకు 4000 కోట్లు గృహ నిర్మాణానికి 54 51 కోట్లు కేటాయించారన్నారు.


# ఏప్రిల్ 1న మ పెళ్లి నిజమే



## రూమర్స్‌పై చమత్కరించిన మృణాల్ ఠాకూర్

సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.


# రోషన్ హీరోగా ఏమోఏమో ఇది మూవీ




ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



# అట్లీ-అల్లుఅర్జున్ మూవీ



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఎ÷-లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ - అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లోకేశ్ కనగరాజ్ హీరోగా డిసి

'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ' . ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.